సాక్షి
వికారాబాద్

ఆదివారం । 17 । సెప్టెంబర్ । 2023



ఏడాదైనా పూర్తి కాలే..!

కుల్కచర్ల మండల కేంద్రంలో సీసీ డబుల్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2కోట్ల 80లక్షలను మంజూరు చేసింది. 2లో▸



చెత్తతో సేంద్రియ ఎరువు!

వానపాములు, ఇతర ప్రత్యేక సరుకులు అవసరం లేకుండానే సేంద్రియ ఎరువు తయారీ విధానం 'నాడెప్ కంపోస్టు'. 2లో▸



వంట కార్మికుల వెట్టిచాకిరీ

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలు, కోడిగుడ్ల బిల్లులు, ఏడీఎం బిల్లులు రాక తీవ్ర ఇబ్బంది పడుతున్నారు. 3లో▸

న్యూస్‌రీల్

అంగన్‌వాడీల సమ్మెకు సంపూర్ణ మద్దతు

బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్



ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్‌కు వినతిపత్రం అందజేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులు

తాండూరు టౌన్: అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మెకు బీఎస్పీ సంపూర్ణ మద్దతిస్తుందని ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. అంగన్‌వాడీ ఉద్యోగులను రెగ్యులరైజేషన్ కోసం ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని ఆయనకు శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆర్‌ఎస్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ.. ఏళ్ల నుంచి పని చేస్తున్న అంగన్‌వాడీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలన్నారు. అంగన్‌వాడీలతో పాటు ఇతర శాఖల వారు సైతం సమ్మె బాటలో ఉన్నారని, వారికి సైతం పార్టీ మద్దతు ప్రకటిస్తోందన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కె.శ్రీనివాస్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు బుగ్గప్ప, అంగన్‌వాడీ ఉద్యోగులు బేబి, సుజాత, రాధ, జయంతి, సంధ్య, రామానుజమ్మ, శోభ తదితరులున్నారు.

పాంబండ హుండీ లెక్కింపు

కుల్కచర్ల: శ్రావణమాస ముగింపును పురస్కరించుకుని పాంబండ రామలింగేశ్వర దేవస్థానంలో కొనసాగిన ఉత్సవాల(చిన్న జాతర) హుండీని శనివారం దేవాదాయ శాఖ అధికారులు జి.సుధాకర్, శేఖర్ సమక్షంలో లెక్కించారు. రూ.3,37,109 ఆదాయం వచ్చింది. భక్తులు ఆలయానికి రెండు కోడెలను కానుకగా ఇవ్వగా వాటిని రూ.5,500 లకు బండవెల్కిచర్ల గ్రామానికి చెందిన సంజయ్ గౌడ్ వేలంలో దక్కించుకున్నారు. అనంతరం ఆలయ ఈఓ సుధాకర్ మాట్లాడుతూ.. ఆలయ అభివృద్ధికి భక్తుల సహకారం తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సంజీవ్ గౌడ్, కృష్ణయ్య, ఆలయ అర్చకులు పాండుశర్మ పాల్గొన్నారు.

లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌పై స్పష్టత ఇవ్వాలి

షాద్‌నగర్‌రూరల్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలో చివరిదైన లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్ నిర్మాణంపై ప్రభుత్వం స్పష్టత ఇవ్వాలని పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ రవీంద్రనాథ్ డిమాండ్ చేశారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. లక్ష్మీదేవిపల్లి రిజర్వాయర్‌కు తట్టెడు మట్టిని ఎత్తకుండా పాలమూరు రంగారెడ్డి పథకం పూర్తయిందని బీఆర్‌ఎస్ పెద్ద ఎత్తున సంబరాలు చేసుకోవడం రాష్ట్ర ప్రజలను, ఉమ్మడి పాలమూరు జిల్లావాసులను మోసం చేయడమేనన్నారు. నార్లాపూర్‌లోని తొమ్మిది పైపులకు ఒక మోటారును మాత్రమే ప్రారంభించి రిజర్వాయర్‌ల పనులు 40శాతమే పూర్తి చేసి అసంపూర్తిగా ఉన్న ప్రాజెక్టును సీఎం కేసీఆర్ ఏ విధంగా ప్రారంభిస్తారని ప్రశ్నించారు. ఇంజనీర్లు చేపట్టాల్సిన ట్రయల్ రన్‌ను ముఖ్యమంత్రి చేయడం సమంజసం కాదన్నారు.

ఆభా.. 182

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు కేంద్ర ప్రభుత్వం 'ఆయుష్మాన్ భవ'కు శ్రీకారం చుట్టింది. ఈ కార్యక్రమాన్ని ప్రధాని జన్మదినం సందర్భంగా ఈ నెల 17 నుంచి అక్టోబర్ 2 గాంధీ జయంతి వరకు నిర్వహించనున్నారు. అర్హులను గుర్తించి వారికి ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) కార్డులు పంపిణీ చేయనున్నారు. ప్రతీ గ్రామంలో ఆయుష్మాన్ సభలు నిర్వహించి ప్రభుత్వ వైద్య సేవలపై అవగాహన కల్పించనున్నారు.

- 154 సబ్ సెంటర్లు
- 24 పీహెచ్‌సీలు
- 4 బస్తీ దవాఖానాల్లో వైద్య సేవలు

నేటి నుంచి 'ఆయుష్మాన్ భవ'

- పల్లె, బస్తీ దవాఖానాల్లో వైద్య మేళాలు
- తెలంగాణ డయాగ్నోస్టిక్స్ ఆధ్వర్యంలో 57 రకాల రుగ్మతలకు ఉచిత పరీక్షలు



రామయ్యగూడ పీహెచ్‌సీ

వికారాబాద్ అర్బన్: పేదలకు ఉచితంగా వైద్య సాయం అందించేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భవ పథకాన్ని తీసుకువచ్చింది. ఆదివారం నుంచి రెండు వారాల పాటు వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే కార్యక్రమంలో జిల్లా వ్యాప్తంగా వైద్య మేళాలు ఏర్పాటు చేయనున్నారు. ఆరోగ్య మేళా, రక్తదాన, యోగా శిబిరాలు ఏర్పాటు చేసి ప్రజలను జాగృతం చేయాలని నిర్ణయించారు. జిల్లా వ్యాప్తంగా ఏరియా ఆస్పత్రులు, పీహెచ్‌సీలు, సీజీహెచ్, అర్బన్ హెల్త్ సెంటర్లు, పల్లె, బస్తీ దవాఖానాలు, హెల్త్, వెల్‌నెస్ సెంటర్లలో ప్రత్యేక వైద్య శిబిరాలు నిర్వహించి వైద్య సేవలతోపాటుగా పథకంపై అవగాహన కల్పిస్తారు.

182 సెంటర్లలో వైద్య పరీక్షలు

జిల్లాలోని 24 పీహెచ్‌సీలు, 154 సబ్ సెంటర్లు, నాలుగు బస్తీ దవాఖానాల్లో ఆయుష్మాన్ భవ కార్యక్రమాన్ని నిర్వహించేందుకు వైద్యాధికారులు ఏర్పాట్లు చేశారు. ఈ కార్యక్రమంలో దీర్ఘకాలిక వ్యాధులైన మధుమేహం, బీపీ, బ్రెస్ట్, ఓరల్, సర్వైకల్ క్యాన్సర్‌లకు సంబంధించిన స్క్రీనింగ్ టెస్టులు చేయనున్నారు. వీటితో పాటు లెప్రసీ, టీబీ తదితర పరీక్షలు చేయనున్నారు. తెలంగాణ డయాగ్నోస్టిక్ నుంచి 57 రకాల రోగాలకు పరీక్షలను నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. పరీక్షలు నిర్వహించిన రెండు రోజుల్లో రోగులకు, ఆయా వైద్య కేంద్రాలకు రిపోర్టు అందించనున్నారు. డయాగ్నోస్టిక్ వారు ఇచ్చే రిపోర్టుల ఆధారంగా వైద్యులకు రోగులకు అవసరమై మందలతో పాటుగా ఉచిత వైద్యం చేయనున్నారు. పీహెచ్‌సీ, ఏరియా ఆస్పత్రుల్లో వైద్యం అందించే పరిస్థితి లేకుంటే జిల్లా ఆస్పత్రికి పంపించే ఏర్పాట్లు చేస్తున్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

పల్లె, పట్టణ ప్రజలు చాలా మంది దీర్ఘకాలిక రోగాల బారిన పడుతున్నారు. అటువంటి వాటి బారిన పడకుండా ఉండాలంటే ఎప్పటికప్పుడు వైద్యుల సలహాలు, సూచనలు తీసుకోవడం మంచిది. ఆయుష్మాన్ భారత్ కార్యక్రమంలో భాగంగా నిర్వహిస్తున్న ప్రత్యేక వైద్య శిబిరాల్లో ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకోవాలి. అక్కడ వైద్యులు సూచించే సలహాలు, సూచనలు పాటించాలి.

– డాక్టర్ పాల్వాన్ కుమార్, డీఎంహెచ్‌ఓ, వికారాబాద్



మట్టి గణపతి ప్రతిమలు పంపిణీ చేస్తున్న అదనపు కలెక్టర్లు

మట్టిగణపతే.. మహాగణపతి

అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యానాయక్

వికారాబాద్ అర్బన్: జలచరాలు, చెరువుల నీరు కలుషితం కాకుండా ప్రతీ ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని అదనపు కలెక్టర్లు రాహుల్ శర్మ, లింగ్యా నాయక్ సంయుక్తంగా పేర్కొన్నారు. శనివారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో రాష్ట్ర కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్లు మట్టి గణపతులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మట్టి గణపతే.. మహాగణపతి అన్నారు. ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలను నిమజ్జనం చేయడంతో జలవనరులు, చెరువులు కాలుష్యమై వృక్షాలు, జంతువులపై ప్రభావం పడుతుందన్నారు. అందుకు ప్రతి ఒక్కరూ మట్టి గణపతులను పూజించాలని.. మనతోపాటు చుట్టుపక్కల వాళ్లకు అవగాహన కల్పించాలన్నారు. కాలుష్య నివారణ మండలి ఆధ్వర్యంలో శనివారం పట్టణంలో 2వేల మట్టి విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు వెల్లడించారు. అనంతరం ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కాలుష్య నియంత్రణ మండలి ప్రాంతీయ పర్యావరణ ఇంజనీర్ వెంకటనర్సయ్య, బీసీ వెల్ఫేర్ అధికారి మల్లేశం, మహిళా శిశు సంక్షేమ శాఖ అధికారిని లలిత కుమారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి కోటాజి తదితరులు పాల్గొన్నారు.

హస్తం..'భేరి'కి సిద్ధం



సభా వేదిక కోసం ఏర్పాట్లు

సాక్షి, రంగారెడ్డిజిల్లా/తుక్కుగూడ: ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఆధ్వర్యంలో తుక్కుగూడ వేదికగా ఆదివారం సాయంత్రం నిర్వహించతలపెట్టిన కాంగ్రెస్ విజయభేరి సభకు సర్వం సిద్ధమైంది. ఫ్యాబ్‌సిటీ సమీపంలోని వంద ఎకరాల విస్తీర్ణంలో భారీ సభా వేదికను ఏర్పాటు చేశారు. కాంగ్రెస్ అగ్రనేత సోనియాగాంధీ, యువనేత రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ సహా సీడబ్ల్యూసీ ముఖ్యులు, అన్ని రాష్ట్రాలకు చెందిన పీసీసీ అధ్యక్షులు, డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు హాజరు కానుండటంతో పీసీసీ ఈ సభను ప్రతిష్టాత్మకంగా తీసుకుంది. నియోజకవర్గాల వారీగా భారీగా జనాన్ని సమీకరించేందుకు 300 బస్సులను సిద్ధం చేసింది. పోలింగ్ బూత్‌లు, బస్తీలు, గ్రామాల వారీగా బస్సులను పంపింది. నియోజకవర్గ ముఖ్య నేతలు సైతం కార్యకర్తలతో పాటే ఆయా బస్సులు, డీసీఎంలలోనే సభాస్థలికి చేరుకోనున్నారు.

రెయిన్ ప్రూఫ్ టెంట్లు

భారీ వర్షానికి సైతం నేతలు తడవకుండా ఉండేందుకు రెయిన్ ప్రూఫ్ టెంట్లను వేశారు. సభాస్థలిపై ఆసీనులైన ముఖ్యనేతల ముఖాలతో పాటు వారి ప్రసంగాలు స్పష్టంగా వినిపించేందుకు సభాస్థలికి నాలుగు వైపులా భారీ ఎల్‌ఈడీ స్క్రీన్లు, లౌడ్ స్పీకర్లు ఏర్పాటు చేశారు. ప్రాంగణం చుట్టూ పెద్ద సంఖ్యలో ఎల్‌ఈడీ లైట్లు ఏర్పాటు చేశారు. తుక్కుగూడకు వచ్చిపోయే ప్రధాన మార్గాలతో పాటు ఫ్యాబ్ సిటీలోకి ప్రవేశించే ప్రధాన దారి వెంట స్వాగత తోరణాలు, భారీ కటౌట్లు, ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. ఎల్బీనగర్, ఇబ్రహీంపట్నం, మహేశ్వరం నియోజకవర్గాల నేతలు ఈ విషయంలో పోటీపడ్డారు. సీడబ్ల్యూసీ ముఖ్య నేతల కోసం ప్రధాన వేదికను కేటాయించారు. పీసీసీలు, మాజీ మంత్రులు, ఎంపీల కోసం ఒకటి.. డీసీసీలు, అనుబంధ సంఘాల నేతలు, కళాకారుల కోసం మరో స్టేజీని కేటాయించారు. ఈ మూడు వేదికలపై సుమారు 250 మంది ఆసీనులు కానున్నారు. ప్రధాన వేదికకు ముందు భాగంలో మీడియా గ్యాలరీ సహా మహిళలు, ముఖ్య నేతల కోసం గ్యాలరీలు ఏర్పాటు చేసి, వాటి చుట్టూ బారీకేడ్లు ఏర్పాటు చేశారు. సభకు వచ్చే ముఖ్య నేతల వాహనాలను ప్రధాన వేదిక వెనుక భాగంలోనే పార్కింగ్ చేయించనున్నారు. ఇతర నేతలు, కార్యకర్తల వాహనాల కోసం సర్వీసు రోడ్డుతో పాటు ఆ ప్రాంగణానికి ఆనుకుని ఉన్న ఖాళీ స్థలాలను కేటాయించారు.

చుట్టూ ట్రాఫిక్ ఆంక్షలు

విజయభేరి సభకు కాంగ్రెస్ పార్టీ ముఖ్య నేతలంతా హాజరు కానుండటంతో పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇప్పటికే ఆ సభా ప్రాంగణాన్ని పూర్తిగా తమ అధీనంలోకి తీసుకున్నారు. తుక్కుగూడకు వచ్చి వెళ్లే నాలుగు ప్రధాన రహదారులపై భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. ఈ బందోబస్తులో ముగ్గురు డీసీపీలు, ఐదుగురు అదనపు డీసీపీలు, ఎనిమిది మంది డీఎస్పీలు, 27 మంది సీఐలు, 61 మంది ఎస్‌ఐలు, 600 మంది కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తించనున్నారు. రోడ్లపై వాహనాల రాకపోకలకు ఇబ్బందులు తలెత్తకుండా ఆయా ప్రాంతాల్లో ట్రాఫిక్ ఆంక్షలు విధించారు. సాయంత్రం 5 గంటలకు తాజ్‌కృష్ణ హోటల్ నుంచి బయలుదేరే ముఖ్య నేతల వాహనాలు శంషాబాద్ నుంచి ఓఆర్‌ఆర్ మీదుగా తుక్కుగూడకు చేరుకుంటాయి. అటు నుంచి ర్యాలీగా ప్రధాన వేదిక వెనుకభాగంలోని ఫ్యాబ్ సిటీ నుంచి సభాప్రాంగణానికి అనుమతించనున్నారు.

నేడే కాంగ్రెస్ విజయభేరి సభ

- దారులన్నీ తుక్కుగూడ వైపే..
- కటౌట్లతో నింపేసిన కార్యకర్తలు
- జనసమీకరణకు ప్రత్యేక బస్సులు
- భారీగా తరలిరావాలని నేతల పిలుపు
- పోలీసుల పటిష్ట బందోబస్తు

భారీగా తరలిరండి

విజయభేరి సభను విజయవంతం చేయాలని మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి దేప భాస్కర్ రెడ్డి కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఈ మేరకు శనివారం ఆర్కేపురం, సరూర్‌నగర్ డివిజన్లలోని పార్టీ శ్రేణులతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. మహేశ్వరం గడ్డపై తొలిసారిగా 10 లక్షల మందితో భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సభకు మహేశ్వరం నియోజకవర్గం నుంచి పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తరలిరావాలని కోరారు.

విజయవంతం చేయండి

మీర్‌పేట: తుక్కుగూడలో ఆదివారం జరగనున్న విజయభేరి బహిరంగ సభను పార్టీశ్రేణులు విజయవంతం చేయాలని డీసీసీ అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి పిలుపునిచ్చారు. మీర్‌పేట మందమల్లమ్మ చౌరస్తాలోని పార్టీ జిల్లా కార్యాలయంలో శనివారం ముఖ్య నాయకులతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సభకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో అడ్డంకులు సృష్టించాలని ప్రయత్నం చేసిందని ఆరోపించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చేసే అరాచకాలను సభలో ఎండగడతామని అన్నారు. సమావేశంలో నాయకులు అమరేందర్‌రెడ్డి, బంగారు బాబు, కీసర యాదిరెడ్డి, సామిడి గోపాల్‌రెడ్డి, ఎరుకల వెంకటేశ్‌గౌడ్, సోమ భూపాల్‌రెడ్డి, గంగమ్మ, సురేందర్ రెడ్డి, అరుణ, పద్మశ్రీ తదితరులు పాల్గొన్నారు.

పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే

సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

మంచాల: తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట చరిత్ర కమ్యూనిస్టులదే అని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. ఎల్లమ్మ తండాలో తెలంగాణ సాయుధ పోరాటంలో అసువులు బాసిన గునుకుల మల్లయ్య, సోమయ్య సమాధులను ఆయన శనివారం సందర్శించారు. పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగం మరువ లేనిదన్నారు. నాటి నుంచి ప్రజా పోరాటాలను ముందుండి నడిపింది సీపీఎం అని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కార్యదర్శి భాస్కర్, నియోజకవర్గ నాయకులు పాల్గొన్నారు.

ఆలు.. సాగు దిగాలు

అనువైన భూములు.. అనుకూల వాతావరణం ఉన్నా ఆలు సాగు విస్తీర్ణం పెరగడం లేదు. వినియోగం పెరిగినా అందుకు తగినట్టుగా ఉత్పత్తి పెంచేందుకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదు. రైతులకు ఇచ్చే రాయితీలు సైతం తొలగించడంతో అన్నదాతలు సాగుకు ముందుకు రావడం లేదు.

- రాయితీ విత్తనాలకు ప్రభుత్వ ప్రోత్సాహం కరువు
- 50వేల ఎకరాల సాగు అనుకూలమైనా.. వెయ్యి ఎకరాలకే పరిమితం
- సిమ్లా శాస్త్రవేత్తలతో అవగాహన కల్పించినా పెరగని సాగు విస్తీర్ణం



ఆలు పంట

వికారాబాద్: జిల్లాలో ఆలు సాగుకు అనుకూల పరిస్థితులున్నా ప్రభుత్వ పోత్సాహం కరువైంది. సాగు ప్రారంభించి పదేళ్లవుతున్నా వెయ్యి ఎకరాలకు మించలేదు. ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో తక్కువ కాలంలో ఎక్కువ లాభాలు వచ్చే పంటలపై వారికి అవగాహన కల్పిస్తున్నామని చెబుతున్నారు. కానీ ప్రభుత్వం ఆదిశగా చర్యలు చేపట్టడంలేదు. రాష్ట్రంలో డిమాండ్ ఉన్నా సాగు ప్రోత్సాహంలో ప్రభుత్వం విఫలమవుతోంది. ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని రెండేళ్లుగా ఊదరగొడుతున్న సర్కార్ కనీసం విత్తన రాయితీ ఇవ్వడం లేదని రైతులు విమర్శిస్తున్నారు. ఉత్తరాది రాష్ట్రాల నుంచి విత్తనం తీసుకురావడంతో పెట్టుబడి పెరుగుతోంది. దీంతో రైతులు సాగుకు వెనకడుగు వేస్తున్నారు.

75శాతం ఇతర రాష్ట్రాల నుంచి దిగుబడి

ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న డిమాండ్‌లో కేవలం 25 శాతం మాత్రమే మన రాష్ట్రంలో పండిస్తున్నారు. ఏడాదికి మన రాష్ట్రంలో 2.03 లక్షల మెట్రిక్ టన్నుల ఆలుగడ్డలు వినియోగిస్తుండగా.. కేవలం 0.47 లక్షల మెట్రిక్ టన్నులు మాత్రమే పండిస్తున్నాం. మిగలిన 1.56 లక్షల మెట్రిక్ టన్నులు ఇతర రాష్ట్రాల నుండి దిగుమతి చేసుకుంటున్నాం. ఇందుకు ప్రతీ ఏట రూ.400కోట్లు వెచ్చిస్తున్నాం. మన వినియోగ లోటును పూడ్చుకుని స్వయం సంవృద్ధి సాధించాలంటే మరో 16వేల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం గుర్తించింది. కానీ ఏళ్లు గడుస్తున్నా ఎటువంటి ముందడుగు వేయలేదు.

దిగుబడిలోనూ ముందంజ

రెండేళ్ల క్రితం సెంట్రల్ పొటాటో రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ డైరెక్టర్ ఐదుగురు శాస్త్రవేత్తలతో రాష్ట్రంలో పర్యటించారు. ఆలు సాగుపై రాష్ట్రంలో మన ఉద్యానవన శాఖ అధికారులతో కలిసి అధ్యయనం చేసిన సిమ్లా శాస్త్రవేత్తల బృందం సంగారెడ్డి, వికారాబాద్, మెదక్ జిల్లాలు ఆలు సాగుకు అత్యంత అనుకూలమని తేల్చింది. రాష్ట్రంలో అధ్యయనం ముగిసిన తర్వాత వికారాబాద్‌లో రాష్ట్ర స్థాయి సదస్సు నిర్వహించి రైతులు, అధికారులు, ప్రజాప్రతినిధులకు ఆలు సాగుపై అవగాహన కల్పించారు. ఈ పంట సాగుకు వికారాబాద్ అత్యంత అనుకూలతలున్న జిల్లాగా గుర్తించారు. ఇదే సమయంలో దిగుబడిలో మన జిల్లా జాతీయ సగటుకంటే ముందుందని గణాంకాలు చెబుతున్నాయి.

ఎకరాకు 12 టన్నులు

ఆలు సాగులో వికారాబాద్ జిల్లా రాష్ట్రంలోనే రెండో స్థానంలో ఉంది. ప్రస్తుతం రాష్ట్రంఓ 5వేల ఎకరాల్లో పంట సాగవుతుండగా అందులో సంగారెడ్డి జిల్లాలో 3500 ఎకరాలు, వికారాబాద్‌లో వెయ్యి ఎకరాలు, మెదక్‌లో 500 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. గతంలో పర్యటించిన సిమ్లా శాస్త్రవేత్తల బృందం మన జిల్లాలో మొత్తం 50వేల ఎకరాల్లో ఆలు సాగు చేసేందుకు నేలలు, వాతావరణం అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. మర్పల్లి, మోమిన్‌పేట, నవాబుపేట, వికారాబాద్, ధారూరు, పూడూరు తదితర మండలాలు ఈ పంట సాగుకు అనుకూలంగా ఉన్నట్టు గుర్తించారు. రాష్ట్ర రాజధానికి చేరువలో జిల్లా ఉండటంతో మార్కెటింగ్ సులవు కానుంది. జిల్లాలో ప్రస్తుతం ఎకరానికి 10 నుంచి 12 టన్నుల దిగుబడిని సాధిస్తున్నట్లు రైతులు చెబుతున్నారు.

అవగాహన కల్పిస్తున్నాం



కూరగాయలు, ఆకు కూరల పంటలు సాగు చేసేందుకు జిల్లాలో అనేక అనుకూలతలు ఉన్నాయి. మార్కెటింగ్ సదుపాయం ఎక్కువగా ఉంది. వచ్చే మూడేళ్లలో ఆలు సాగును ప్రోత్సహిస్తాం. స్వల్పకాలిక పంట కావటంతో రైతుకు అధిక లాభాలు వచ్చే అవకాశం ఉంది. రైతులు డిమాండ్ ఉన్న పంటలు సాగుచేసేలా అవగాహన కల్పిస్తున్నాం. విత్తన రాయితీ ఇచ్చే విషయంలో ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు.

– చక్రపాణి, జిల్లా ఉద్యానవన శాఖ అధికారి

క్లుప్తంగా

విద్యుదాఘాతంతో ఆవు మృతి



ఆవు కళేబరాన్ని పరిశీలిస్తున్న వైద్యాధికారి

కొడంగల్ రూరల్: విద్యుదాఘాతంతో ఆవు మృతి చెందిన సంఘటన మండల పరిధిలో శుక్రవారం రాత్రి చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి. హస్నాబాద్ గ్రామానికి చెందిన చాకలి రఘు ఆవులను రోజులాగే పశువుల కొట్టంలో కట్టేసి ఇంటికి వెళ్లాడు. రాత్రి వేళలో ఆవు తాడు తెంచుకొని పొలంలో మేత మేస్తుండగా.. పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్‌కు తాకి కరెంట్ షాక్‌తో మృత్యువాత పడింది. శనివారం ఉదయం రఘు వచ్చి చూడగా ఆవు చనిపోయి ఉంది గమనించి విద్యుత్ సిబ్బందికి, పశు వైద్యాధికారులకు సమాచారం ఇచ్చాడు. వైద్యాధికారి రియాజ్ అహ్మద్ సంఘటనా స్థలాన్ని పరిశీలించారు. అనంతరం బాధితుడు రోదిస్తూ ఒంగోలు ఆవు ఖరీదు రూ.60 వేలు ఉంటుందని, ప్రభుత్వం ఆదుకోవాలని కోరాడు.

మండపాల ఏర్పాటుకు అనుమతి తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న పోలీసులు

దౌల్తాబాద్: వినాయక చవితి నవరాత్రోత్సవాల్లో భాగంగా ఏర్పాటు చేసే మండపాలకు నిర్వాహకులు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు చెప్పారు. ఈ మేరకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో వారు మాట్లాడారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలు, ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని సూచించారు. డీజేలకు అనుమతి లేదని, ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా ఉత్సవ కమిటీ జాగ్రత్తలు తీసుకోవాలని చెప్పారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత



పట్టుబడిన ట్రాక్టర్

బషీరాబాద్: అక్రమంగా ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను బషీరాబాద్ పోలీసులు శుక్రవారం అర్ధరాత్రి పట్టుకున్నారు. మండలంలోని మైల్వార్ తండా చెరువు నుంచి టీఎస్34 హెచ్9297 నంబరు గల ట్రాక్టర్‌లో అనుమతులు లేకుండా ఇసుక తరలిస్తున్నట్లు పోలీసులకు సమాచారం అందింది. దీంతో వారు వాహనాన్ని వెంబడించి పట్టుకున్నారు. ఈ మేరకు డ్రైవర్ మహ్మద్ జమీర్‌పై కేసు నమోదు చేసి, ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

కానిస్టేబుల్స్‌కు అభినందన



కానిస్టేబుల్‌కు రివార్డు అందిస్తున్న డీసీపీ

ఆమనగల్లు: సీఎం కాన్వాయ్‌ను అడ్డుకోబోయిన బీజేవైఎం నాయకులను నిలువరించిన మహిళా కానిస్టేబుళ్లను శంషాబాద్ డీసీపీ నారాయణరెడ్డి అభినందించారు. ఆమనగల్లు పట్టణంలో సీఎం కేసీఆర్ కాన్వాయ్ వెళ్తున్న సమయంలో బీజేవైఎం నాయకులు అడ్డుకునే ప్రయత్నం చేయగా.. అక్కడే విధులు నిర్వహిస్తున్న మహిళా కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవీలు వారిని నిలువరించి, కాన్వాయ్ సాఫీగా సాగేందుకు కృషి చేశారు. ఈ నేపథ్యంలో స్థానిక పోలీసు స్టేషన్‌లో కానిస్టేబుళ్లు అపర్ణ, రమాదేవిలను డీసీపీ నారాయణరెడ్డి అభినందించి క్యాష్ రివార్డు అందజేశారు. ఇందులో షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి, ఆమనగల్లు సీఐ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ ఉన్నారు.

ఏడాదైనా పూర్తి కాలే..!

పాలకులు, అధికారుల నిర్లక్ష్యం సామాన్యులకు ఇబ్బందిగా మారింది. అభివృద్ధి పనుల విషయంలో జవాబుదారి లేని తనం పెనుశాపంగా మారింది. ఒకటి రెండు, గరిష్టంగా ఆరు నెలల్లో పూర్తి చేయాల్సిన రోడ్లు తదితర నిర్మాణాల పనులు.. నిర్మాణ దారుల కాలయాపనతో యేడాది గడుస్తున్నా పూర్తి కాకపోవటంతో ప్రజాధనం వృథా అవుతోంది.

తీరుమారదు గోస తప్పదు

- రహదారి నిర్మాణ పనుల్లో జాప్యం
- ఏడాది కావస్తున్నా పూర్తికాని సీసీరోడ్డు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంతో సామాన్యులకు ఇబ్బంది



ఒక వైపు రోడ్డు మరోవైపు కంకరమట్టి వేసి వదిలేసిన రహదారి దుస్థితి

కుల్కచర్ల: మండల కేంద్రంలో సీసీ డబుల్ రోడ్డు ఏర్పాటుకు ప్రభుత్వం రూ.2కోట్ల 80లక్షలను మంజూరు చేసింది. ప్రధాన చౌరస్తా నుంచి చిన్నగేటు వరకు 1.2 కి.మీ. డివైడర్‌తో సీసీ ఏర్పాటుకు 2022 మార్చి మొదటివారంలో పనులను ప్రారంభించారు. విడతలుగా.. ఒక వైపు మాత్రమే పూర్తిచేశారు. మరోవైపు కంకర వేసి వదిలివేయడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురౌతున్నారు.

ఎక్కడ వేసిన గొంగడి అక్కడే

ఏడాది కాలంలో రహదారిని తవ్వేసి, కొత్తగా వేయాల్సిన రోడ్డుపనులు సదరు కాంట్రాక్టర్ పట్టించుకోకపోవడం లేదు. అధికారులు నోటీసులు జారీ చేసినా వాటిని ఖాతరు చేయడం లేదని, దీంతో ఆ రహదారి పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే నన్న చందంగా మారిందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఒక వైపు రోడ్డు, మరోవైపు కంకర వేయడంతో వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారని ప్రజలు పేర్కొంటున్నారు. వెనకాల వస్తున్న వాహనదారులు దుమ్ముధూళితో ఉక్కిరిబిక్కిరై అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నట్లు వాపోతున్నారు.

దుమ్ముతో నిండిన దుకాణం



నిర్మాణ దారుల నిర్లక్ష్యం వలన దుమ్ముధూళితో ఇబ్బంది పడుతున్నాం. మట్టి, కంకర రోడ్డులో వెళ్తున్న వాహనాల కారణంగా గాలిలో దుమ్ములేచి దుకాణంలోకి వస్తోంది. తద్వారా అనారోగ్యం పాలవుతున్నాం. అధికారులు పట్టించుకుని రోడ్డు పనులు పూర్తి చేయించాలి.

– శివసంతోష్, దుకాణదారుడు, కుల్కచర్ల

చర్యలు తీసుకోవాలి



నిత్యం వాహనాలు తిరిగే రోడ్డును నిర్లక్ష్యం చేయడం బాధాకరం. నిర్మాణ దారులు ఇష్టం వచ్చినప్పుడు కొద్దికొద్దిగా పనులు చేయడం వలన వాహన దారులకు, రోడ్డు పక్కన ఉన్న దుకాణ దారులకు, నివాసం ఉంటున్న వారికి దుమ్ముధూళి పెను సమస్యగా మారింది. నిర్వాహకులపై చర్యలు తీసుకుని, నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలి.

– మధుకర్ గౌడ్, దుకాణదారుడు, కుల్కచర్ల

ఉన్నతాధికారుల దృష్టికి..

రోడ్డు పనుల్లో జరుగుతున్న జాప్యం గురించి జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్లాం. సంబంధిత కాంట్రాక్టర్ నిర్లక్ష్యం చేస్తుండటంతో నోటీసులు జారీ చేసే ప్రక్రియ కొనసాగుతోంది. రోడ్డు నిర్మాణం పూర్తికి చర్యలు తీసుకొని, ప్రజలకు అసౌకర్యం కలగకుండా చూస్తాం.

– మహేశ్, ఆర్అండ్‌బీ ఏఈ, కుల్కచర్ల

హత్యకేసులో నిందితుల అరెస్ట్

రిమాండ్‌కు తరలింపు



వివరాలు వెల్లడిస్తున్న పోలీసులు

నందిగామ: చాకలిగుట్ట తండాలో గురువారం రాత్రి జరిగిన హత్య కేసులో నిందుతులైన దంపతులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. బీహార్ రాష్ట్రం బాక్సర్ జిల్లా బాషీ గ్రామానికి చెందిన తరుణ్ చౌదరి(41) మేకగూడ శివారులోని ఓ గోదాంలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తూ.. చాకలిగుట్ట తండాలో నివాసం ఉంటున్నాడు. బీహార్‌కు చెందిన అక్షయ్ బింద్ తన భార్య గుడియా దేవిలు సైతం స్థానికంగా ఓ పరిశ్రమలో కార్మికులుగా పని చేస్తూ ఇదే తండాలో ఉంటున్నారు. తరుణ్ చౌదరికి అక్షయ్ బింద్ దూరపు బంధువు కావడంతో తరుణ్ చౌదరి తరచుగా అక్షయ్ ఇంటికి వచ్చేవాడు. ఈ నేపథ్యంలో తరుణ్ చౌదరికి గుడియా దేవికి అక్రమ సంబంధం ఏర్పడింది. విషయం తెలిసిన అక్షయ్.. తన భార్యను పలుమార్లు మందలించాడు. మరోసారి అలా చేస్తే తరుణ్ చౌదరిని చంపేస్తానని భార్యను హెచ్చరించాడు.

గొంతు నులిమి..

ఈ క్రమంలో మృతుడు తరుణ్ చౌదరి గురువారం రాత్రి మద్యం సీసాలను తీసుకొని అక్షయ్ ఇంటికి వచ్చాడు. ముగ్గురు కలిసి మద్యం సేవించిన అనంతరం తాగిన మైకంలో తరుణ్ చౌదరి గడియా దేవితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. విషయాన్ని గమనించిన అక్షయ్.. తరుణ్‌పై దాడి చేశాడు. గడియా సైతం భర్తకు సహకరించంతో ఇద్దరు కలిసి పిడిగుద్దులు గుద్ది గొంతు నులిమి ఊపిరి ఆడకుండా చేసి చంపేశారు. అనంతరం ఏమి తెలియనట్లు చికిత్స నిమిత్తం షాద్‌నగర్‌లోని ప్రభుత్వ కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించారు. గమనించిన వైద్యులు అప్పటికే మృతి చెందాడని చెప్పారు. దీంతో వారు అక్కడి నుంచి పారిపోయారు. విషయం తెలిసిన పోలీసులు ఆర్ఐ రోజా ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుల కోసం వెతుకుతుండగా శనివారం ఉదయం నందిగామ చౌరస్తాలో అనుమానాస్పదంగా కనపడటంతో అదుపులోకి తీసుకొని విచారించగా నేరం ఒప్పుకున్నారని ఇన్‌స్పెక్టర్ సురేష్ తెలిపారు. దీంతో నిందితులను కోర్టులో హాజరు పరిచి, అనంతరం రిమాండ్‌కు తరలించినట్లు ఆయన తెలిపారు.

బీఎస్పీ జెండా ఆవిష్కరణ



జెండా ఆవిష్కరించిన ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్

ధారూరు: మండల కేంద్రంలో బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆ పార్టీ జెండాను ఆవిష్కరించారు. శనివారం సాయంత్రం ధారూరు చౌరస్తా నుంచి అంబేడ్కర్ చౌరస్తా వరకు నిర్వహించిన ర్యాలీలో ఆయన పాల్గొన్నారు. అనంతరం అంబేడ్కర్ చౌరస్తాలో ఏర్పాటు చేసిన బీఎస్పీ జెండాను ఆవిష్కరించారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

చదువుతో పాటు ఆటల్లో రాణించాలి



క్రీడాకారులకు బహుమతులను ప్రదానం చేస్తున్న అధికారులు

మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్

కుల్కచర్ల: విద్యార్థులు తమకు నచ్చిన క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవాలని మండల విద్యాధికారి హబీబ్ అహ్మద్ సూచించారు. శనివారం కుల్కచర్ల మండలం బండవెల్కిచర్ల గ్రామంలో బండవెల్కిచర్ల గిరిజన గురుకుల ఆశ్రమ పాఠశాలలో జరిగిన జోనల్ స్థాయి ఖోఖో పోటీలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులు చదువుతో పాటుగా క్రీడల్లో రాణించాలని ఆకాంక్షించారు.

సత్తాచాటిన విద్యార్థులు

ఆటల పోటీల్లో బాలికల విభాగంలో అండర్17లో దిర్సంపల్లి పాఠశాల ప్రథమ స్థానంలో నిలవగా, ద్వితీయ స్థానంలో జాఫర్‌పల్లి మోడల్ స్కూల్ నిలిచింది. అండర్14లో దిర్సంపల్లి మొదటి, జాఫర్‌పల్లి మోడల్ స్కూల్ రెండో స్థానంలో నిలిచాయి. బాలుర విభాగంలో అండర్17లో టీటీడబ్ల్యూఆర్ఎస్ బండవెల్కిచర్ల ప్రథమ, ద్వితీయంలో దిర్సంపల్లి పాఠశాల, అండర్14లో టీటీడబ్ల్యూఆర్ఎస్ బండవెల్కిచర్ల ప్రథమ, ద్వితీయంలో పరిగి సోషల్ వెల్ఫేర్ ఆశ్రమ పాఠశాల నిలిచింది. కార్యక్రమంలో గిరిజన గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గంగారాంనాయక్, పీఈటీలు ప్రవీణ్, ఖాజ, సుభాష్, రాజేందర్, కేశవులు పాల్గొన్నారు.

చెత్తతో సేంద్రియ ఎరువు

- లేత కొమ్మలతో 'నాడెప్ కంపోస్టు'
- సహజ ఎరువు తయారీకి రైతుల ఆసక్తి
- మూడు నెలలకు టన్ను నాణ్యమైన ఎరువు సిద్ధం



తొట్టిలో కంపోస్టు ఎరువు తయారీ

బొంరాస్‌పేట: వానపాములు, ఇతర ప్రత్యేక సరుకులు అవసరం లేకుండానే నాణ్యమైన సేంద్రియ ఎరువు తయారీ విధానం 'నాడెప్ కంపోస్టు'. ఈ విధానంలో అన్ని రకాల చెట్లు, పిచ్చి మొక్కల ఆకులు, పశువుల పేడతో తయారు చేసుకునే ఖర్చు తక్కువ విధానమిది. దీనిపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. నాడెప్ అనే నామకరణం ఈ పద్ధతిని ప్రవేశపెట్టిన శాస్త్రవేత్త పేరు. పొలం చుట్టూ ఉన్న ఆకులు, కొమ్మలతో పంటలకు అవసరమైన సేంద్రియ ఎరువును రైతే స్వయంగా తయారు చేసుకునే సులభమైన విధానం ఇది.

తయారీ విధానం

నాడెప్ కంపోస్టు తొట్టి తయారీకి మొదట పొలంలో అవసరమైన స్థలాన్ని ఎంపిక చేసుకోవాలి. నేలపై 10ఫీట్ల పొడవు, 6 ఫీట్ల వెడల్పు, 3 ఫీట్ల ఎత్తుతో ఇటుకలతో రంధ్రాల గోడ నిర్మించుకోవాలి. నిర్మించిన గోడకు లోపల, బయట సిమెంటు ప్లాస్టర్ చేయాలి.

క్యూరింగ్ తర్వాత ఇందులో..

అడుగు, లోపలి గోడలకు చిక్కటి పశువుల పేడను పూయాలి. తర్వాత ఒక ఫీటు ఎత్తు వరకు వివిధ రకాల చెట్ల లేత కొమ్మలను(పచ్చి ఆకులు) వేయాలి. ఆ తర్వాత పేడ నీళ్లు చల్లాలి. ఇలా మూడు దఫాలుగా మూడుఫీట్ల ఎత్తు వరకు ఆకులు, కొమ్మలు, పేడనీళ్లతో క్రమపద్ధతిన నింపాలి. పూర్తిగా నిండిన తర్వాత పైభాగం రెండు ఇంచులు మట్టితో కప్పాలి. పంటను దెబ్బతీసే, భూ కాలుష్యాన్ని కలిగించే వస్తువులు(గాజు, సీసం, ప్లాస్టిక్, పాలిథిన్, ముళ్లు తదితర వాటిని) కంపోస్టు తొట్టిలో ఉండకుండా జాగ్రత్త తీసుకోవాలి. 15 నుంచి 20 రోజుల వరకు నీళ్లతో తడపాలి. మూడు నెలల తర్వాత ఒక టన్ను నాణ్యమైన సేంద్రియ ఎరువు(కంపోస్టు ఎరువు) తయారవుతుంది.

జిల్లాలో అమలు..

2013–2014 నుంచి డీఆర్‌డీఏ, ఐకేపీ, సుస్థిర వ్యవసాయ శాఖ సంయుక్త ఆధ్వర్యంలో జిల్లాలోని వాటర్ షెడ్ గ్రామాల్లో ఈ 'నాడెప్ విధానం' అమలువుతోంది. ఇందుకు ఒక్కో గ్రామంలో 15 నుంచి 25 మంది వరకు రైతులను ఎంపిక చేసి కంపోస్టు ఎరువు తయారీ, వాడకంపై అవగాహన కల్పిస్తున్నారు. ఇందుకు అవసరమయ్యే ఖర్చు(రూ.10వేల వరకు) రైతులకు అందిస్తున్నారు. ఈ కార్యక్రమం మూడేళ్ల వరకు కొనసాగుతుంది. కొడంగల్ నియోజకవర్గంలో బొంరాస్‌పేట మండలంలో 200, దౌల్తాబాద్‌లో 150, కోస్గి 160 నాడెప్ కంపోస్టు తొట్లు ఉపయోగంలో ఉన్నాయి.

విధానం బాగుంది

ఇదివరకు వర్మీ కంపోస్టు(వానపాముల ఎరువు)ను కొనుగోలు చేసి.. పలు జాగ్రత్తలు, పెట్టుబడి ఖర్చులతో తయారీ విధానం ఉండేది. ఈ ఎరువును తయారు చేసుకొని పంటలకు వాడాను. ఫలితం బాగుంది. కంపోస్టు తొట్లను రాయితీపై నిర్మించి ఇవ్వాలి.

– పరమేశ్వర్, రైతు నాగిరెడ్డిపల్లి(బొంరాస్‌పేట)

రైతుల ఆసక్తి

వాటర్‌షెడ్ నిధులతో నాడెప్ కంపోస్టు విధానం అమలు జరుగుతోంది. శ్రమ, ఖర్చు అంతగా లేకుండా ఉండటంతో ఈ నాడెప్ విధానంపై రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులు ఎవరైనా తయారుచేసుకునే సులభమైన విధానం ఇది. మొదటిదఫా పూర్తి కావస్తోంది.

– నసీర్‌మియా, కోఆర్డినేటర్, బొంరాస్‌పేట

మట్టి ప్రతిమలకే మొగ్గు

కొనుగోలు దారులతో కిటకిటలాడుతున్న దుకాణాలు

- రసాయన గణపతి విగ్రహాలకు ఆసక్తి చూపని భక్తులు
- గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రభుత్వానికి లంబోదరుల పంపిణీ
- రేపు చవితి నవరాత్రోత్సవాలు



మొయినాబాద్‌రూరల్: అమ్మకానికి సిద్ధంగా ఉన్న మట్టి గణపతులు

మొయినాబాద్‌రూరల్: భక్తులు ప్రప్రథమంగా పూజ చేసేది ఆదినాయకుడు గణనాథుడికే. చవితి నవరాత్రులు సమీపిస్తున్న వేళ.. పూజాసామగ్రి, విగ్రహాలను విక్రయించే దుకాణాలు క్రయవిక్రయ దారులతో కిటకిటలాడుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా కాలుష్య నియంత్రణకు ప్రజలు తమవంతుగా రసాయనలేమి విగ్రహాలను కొలిచేందుకు మక్కువ చూపుతున్నారు.

భారీగా విగ్రహాల తయారీ

రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం హిమాయత్‌నగర్‌లో 15 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను రాష్ట్ర ప్లే గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో తయారు చేస్తున్నారు. అదే వృత్తిగా మలచుకొని ఉపాధి పొందుతూ.. పలువురికి ఉపాధి కల్పిస్తున్నారు. మట్టి విగ్రహాలకు పట్టణాలు, పల్లెల్లోనూ ఆదరణ లభించడంతో ఆర్డర్లు తీసుకొని సైజు, వివిధ ఆకారాల్లో తయారు చేసి వారి ఇంటికి, కార్యాలయాలు, దుకాణాలకు పంపించడం గమనార్హం. ముఖ్యంగా ట్యాంక్‌బండ్, నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్, రాష్ట్ర ప్రభుత్వం ద్వారా విగ్రహాలను భక్తులకు ఉచితంగా పంపిణీ చేసేందుకు జీహెచ్ఎంసీ, హెచ్ఎండీఏ, పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ద్వారా దాదాపు మూడు లక్షల మట్టి వినాయకులను తరలిస్తున్నారు.

మట్టి వినాయకున్నే పూజిద్దాం..

చేవెళ్ల: మట్టి వినాయకులను పూజిద్దాం.. పర్యావరణాన్ని కాపాడుకుందామని పర్యావరణ వేత్తలు, విద్యావంతులు ప్రచారం చేస్తున్నారు. ప్రపంచాన్ని పీడిస్తున్న అతి పెద్ద సమస్య పర్యావరణ కాలుష్యమని, ఈ ప్రభావం సమస్త జీవకోటిపై పడుతుందని ఆవేదన చెందుతున్నారు. రేపు చవితి సందర్భంగా పరిమాణంతో సంబంధం లేకుండా మట్టి ప్రతిమలనే పూజించాలని కోరుతున్నారు. రంగులతో చేసిన విగ్రహాల నిమజ్జనం కారణంగా 10వేల టన్నుల రసాయన వ్యర్థాలు భూమిలో చేరుతున్నాయని, భూమ్మీద ఉన్న 71శాతం జలరాశిలో 68శాతం సముద్ర జలాలే ఉన్నాయని పర్యావరణ ప్రేమికులు తెలిపారు. విగ్రహాల తయారీలో ఇనుము, కృత్రిమ రంగుల వాడకంలో పాదరసం, క్రోమియం, సీసం, కాడ్మియం తదితర విషపూరిత రసాయనాలను వాడుతున్నారని, ఈ విగ్రహాలను నీటిలో నిమజ్జనం చేయటం ద్వారా.. ఆ నీటిని పశువులు, పక్షులు తాగటం వలన అనారోగ్యానికి గురై మృత్యువాత పడుతున్నాయని ఆందోళన చెందుతున్నారు. ఇవే నీటిని ప్రజలు ఉపయోగించటంతో రకరకాల వ్యాధుల బారిన పడుతున్నారని విద్యావేత్తలు, వైద్యులు ఆందోళన చెందుతున్నారు. కాలుష్యాన్ని నివారించాలన్నా.. జీవరాశులను కాపాడుకోవాలన్నా.. మట్టి విగ్రహాలను పూజించాలని పలువురు కోరుతున్నారు.

రుణం ఇస్తే బాగుంటుంది



గణేశ్ సొసైటీ ఆధ్వర్యంలో మట్టి విగ్రహాల తయారీ విస్తృతంగా జరుగుతోంది. ఈ యేడు సుమారు 4 లక్షలకు పైగా అర ఫీటు నుంచి ఆరు ఫీట్ల ఎత్తు వరకు విగ్రహాలను తయారు చేసి, రూ.50 నుంచి రూ.15 వేల వరకు విక్రయిస్తున్నాం. ఇందులో ప్రభుత్వానికి మూడు లక్షలకు పైగా సరఫరా చేయనున్నాం. ఆర్థికంగా ప్రభుత్వం బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పిస్తే బాగుంటుంది. కుటుంబ పోషణతో పాటు పలువురికి ఉపాధి దొరుకుతుంది. ఇలాంటి సంస్థలను ప్రభుత్వం గుర్తించాలి.

– కుమ్మరి మంజుల, సొసైటీ రాష్ట్ర అధ్యక్షురాలు

కాలుష్య భూతాన్ని తరిమికొట్టండి



చవితి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో జరుపుకోవాలి. అదే సమయంలో పర్యావరణాన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత మనందరిది. అందుకు మట్టి విగ్రహాలను పూజించి, నిమజ్జనం చేయాలి. 19 ఏళ్లుగా మట్టి గణపతులను తయారు చేయించి ప్రజలకు పంపిణీ చేస్తూ అవగాహన కల్పిస్తున్నాను. ప్రతి ఒక్కరు మట్టి ప్రతిమలను పూజించి కాలుష్య భూతాన్ని తరిమికొట్టాలి.

– పి.రామకృష్ణారావు, పర్యావరణ వేత్త, చేవెళ్ల

'ఓజోన్' పరిరక్షణ అందరి బాధ్యత



పాఠశాల ఆవరణలో మొక్క నాటుతున్న ఎస్‌ఐ, విద్యార్థులు తదితరులు

దారూర్: ఓజోన్ పొర పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యత అని ఎస్సై సంతోష్ కుమార్ తెలిపారు. ప్రపంచ ఓజోన్ పరిరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ధారూర్ మండలం కుక్కింద ఉన్నత పాఠశాలలో తాండూర్ రామకృష్ణ సేవా సమితి, గ్రీన్ ఇండియా చాలెంజ్ ఆధ్వర్యంలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. పర్యావరణాన్ని సంరక్షించి, గ్లోబల్ వార్మింగ్ రాకుండా ప్రపంచ దేశాలు బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. గ్రీన్ ఇండియా చాలెంజ్ కన్వీనర్ కె.విజయలక్ష్మి మాట్లాడుతూ స్వచ్ఛమైన నీరు, గాలి ముందు తరాలకు అందించాల్సిన బాధ్యత మనందరిపై ఉందన్నారు. ఆధునిక పోకడలతో పర్యావరణ కాలుష్యానికి కారకులుగా మారుతున్నారని చెప్పారు. రసాయన మందులు తగ్గించి ప్రకృతి సాగుకు రైతులు మొగ్గు చూపాలని ఆమె సూచించారు. అనంతరం పాఠశాల ఆవరణలో అల్లనేరేడు మొక్కలు నాటి, 200 సీడ్స్ బాల్స్‌ను కోటపల్లి అటవీ ప్రాంతంలో విసిరారు. కార్యక్రమంలో రామకృష్ణ సేవా సమితీ అధ్యక్షుడు బాలకృష్ణ, ఫారెస్ట్ సెక్షన్ అధికారి రాజేందర్ రెడ్డి, ప్రోగ్రాం కన్వీనర్ వెంకట్, శివ, నర్సింహులు రాజు, అంజిరెడ్డి గోవర్ధన్ రావు, రాజశేఖర్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

108 అంబులెన్స్‌లో ప్రసవం

తల్లీబిడ్డ క్షేమం



అంబులెన్స్‌లో తల్లీబిడ్డతో బంధువు, 108 సిబ్బంది

పెద్దేముల్: పురిటి నొప్పులతో బాధపడుతున్న ఓ మహిళను అంబులెన్స్‌లో తరలిస్తుండగా మార్గమధ్యలోనే ప్రసవించింది. 108 సిబ్బంది ఈఎంటీ శివకుమార్, నసీర్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధారూర్ మండలం అంపల్లితండాకు చెందిన సుశీల (25) శనివారం సాయంత్రం పురటి నొప్పులతో బాధపడుతోంది. ఈ క్రమంలో ఆమెను 108 వాహనంలో తాండూరు మాతాశిశు సంరక్షణ ఆసుపత్రికి తరలిస్తుండగా తాండూరు–హైదరాబాద్ ప్రధాన రహదారిపై పెద్దేముల్ మండలం మంబాపూర్ సమీపంలో ప్రసవించింది. పండంటి మగ బిడ్డకు జన్మనిచ్చింది. ప్రస్తుతం తల్లి, బిడ్డ క్షేమంగా ఉన్నట్లు తెలిపారు. అనంతరం సంరక్షణ ఆసుపత్రికి తరలించారు.